



గుంటూరు సీసీఐ కేంద్రంలో పత్తి ఆటో

రూ.20 ఇస్తే..పాస్

సీసీఐ కేంద్రాల్లో రైతుల నిలువు దోపిడీ

సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతు జేబుకు చిల్లు పడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన వాళ్లే అన్నదాతలతో ఆడుకుంటున్నారు. సాధారణంగా పరీక్షల్లో వందకు 35 మార్కులు వస్తే పిల్లలను టీచర్లు పాస్ చేస్తారు. అలానే రైతులు తీసుకొచ్చిన పత్తి బండి సీసీఐ కొనుగోలు కేంద్రంలోనికి వెళ్లాలంటే.. క్వింటాల్‌కు రూ.20లు చెల్లిస్తేనే పాస్ చేస్తున్నారు. లేదంటే లోనికి పంపేది లేదని మంకుపట్టు పడుతున్నారు. ఇది అప్పటికి చిన్న దోపిడీలా కనిపించినా.. కొనుగోళ్లు పూర్తయ్యే సరికి రూ.కోట్లకు చేరుకుంటోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని సీసీఐ కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

- లోనికి వెళ్లాలంటే.. క్వింటాల్‌కు రూ.20 ఇవ్వాల్సిందే
- దిగుమతి కూలీ రెట్టింపుతో జేబుకు చిల్లు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

సాధారణంగా రైతులు తీసుకొచ్చిన పత్తి నిల్వలకు సంబంధించిన ప్రాథమిక సమాచారం నిర్ధారించాల్సిన బాధ్యత మార్కెటింగ్ శాఖది. ఈ పని చేసేందుకు ప్రతి సీసీఐ కేంద్రంలో మార్కెటింగ్ శాఖ సూపర్ వైజర్‌ను నియమించింది. ఆయా మండలాల నుంచి వచ్చిన రైతుల వివరాలు సీఎం యాప్, కిసాన్ యాప్‌లలో సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయం సదరు సిబ్బంది పరిశీలిస్తారు. వారు పరిశీలించిన తర్వాతే మిగిలిన కొనుగోలు ప్రక్రియ ఆరంభం అవుతుంది.

అదే అదునుగా...

ఒక వేళ మార్కెటింగ్ శాఖ సిబ్బంది (మిగతా 6వ పేజీలో)

దిగుమతి కూలీ రెట్టింపు

ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లో దింపుడు కూలీ ధరలు ఆసాంతం పెంచేశారు. గతంలో ఉన్న ధర కంటే రెట్టింపు కావడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నాలుగు చక్రాల ఆటోలో పత్తి తీసుకువస్తే దిగుమతి కూలీ రూ.1000 నుంచి రూ.1200 వరకు తీసుకుంటున్నారు. అదే ట్రాక్టర్‌లో తీసుకు వస్తే రూ.1500 కు తగ్గకుండా తీసుకుంటున్నారు. లారీలో అయితే ఒక్కో చోట ఒక్కో ధర వసూలు చేస్తున్నారు. దిగుమతి కూలీ వ్యవహారంలో ఒకే విధానం లేక పోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. చాలా సందర్భాల్లో ఈ విషయంలో గొడవలు కూడా జరుగుతున్నాయి.



ఆకట్టుకున్న 'ఆంధ్ర ఏకలవ్య'

- కరతాళ నీరాజనం అందుకున్న 'ఆపరేషన్ సిందూర్'
- కేఎల్‌యూలో 2వ రోజు ఉద్భవ్ ఉత్సవం



స్పీడ్ యాక్సిస్ రోడ్డు పనులు

- ఫేజ్- 2లో కి.మీ. మేర సెంటర్ కారిడార్ రోడ్డు పూర్తి
- మంతెన ఆశ్రమం నుంచి సీఎం ఇంటి వరకు పొడిగింపు
- అనుసంధానంగా రెండు అప్రోచ్‌లు
- కుడి, ఎడమ కారిడార్లలో మౌలిక సదుపాయాలు

8

ఆసుపత్రికి తాళం.. సిబ్బంది సస్పెన్షన్

- ఇద్దరు డాక్టర్లు సహా 12 మందిపై వేటు
- కమిషనర్ ఆకస్మిక తనిఖీలో బయటపడిన నిర్వాహకం

6

రేపు కోటప్పకొండలో ఆరుద్రోత్సవం

- తరలి రానున్న మాలధారులు
- విశేష అభిషేకాలకు విస్తృత ఏర్పాట్లు

కోటప్పకొండ(నరసరావుపేట), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామికి ఆరుద్రోత్సవం శనివారం అత్యంత ఘనంగా జరగనుంది. ఇందుకు ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. త్రికోటేశ్వర స్వామిని మేధా దక్షిణామూర్తిగా భక్తులు కొలుస్తారు. కోటి వరాల దీక్ష కోటప్పకొండ దీక్ష అనే సంకల్పంతో మాలను ధరిస్తారు. కోటప్పకొండలో 1981 నుంచి కోటయ్య స్వామి మాలధారణ ప్రారంభమైంది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు కోటప్ప మాలను ధరించి 41 రోజులు మండల దీక్షను భక్తిశ్రద్ధలతో చేపడతారు. అయ్యప్ప స్వాముల వలె కోటయ్య మాలధారులు ఇరుముడితో కొండకు చేరుకుంటారు. ఆరుద్రోత్సవం సందర్భంగా కోటయ్య స్వామికి స్వాములు ఇరుముడి సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇరుముడిని స్వాములు తలపై ధరించి నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి కొందరు స్వాములు పాదయాత్రగా కోటప్పకొండ చేరుకుంటారు.

విశేషంగా అభిషేకాలు

కోటప్పకొండలో ఆరుద్రోత్సవం సందర్భంగా స్వామికి వివిధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. జ్యోతి దర్శనం అనంతరం త్రికోటేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక మహారుద్రాభిషేకం జరగనుంది. వీభూది, గంధం, కుంకుమ, పంచదార, వివిధ రకాల ఫలాలు, శుష్క ఫలాలు, ఆవు నెయ్యి, పెరుగు, తేనె, పాలు తదితర ద్రవ్యాలతో స్వామికి ఘనంగా అభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి స్వామికి అన్నాభిషేకం చేస్తారు. అర్ధరాత్రి నుంచి ఆలయంలో మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాలు జరగనున్నాయి. అభిషేకాల అనంతరం స్వాములు మాల ధారణలు విరమిస్తారు. ఆదివారం ఉదయం గంటలకు యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్ర, శాంతి, వాస్తు హోమాలు నిర్వహిస్తారు. స్వాములకు ప్రసాదం, భోజన సౌకర్యాలు ఆలయ ప్రాంగణంలో దాతలు తాళ్ల వెంకట కోటిరెడ్డి, అల్లు రమేష్, జయరామిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. ఏర్పాట్లను ఈవో డి.చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు.



మేధా దక్షిణామూర్తి

నేడు పాఠశాల పండుగ

మెగా పీటీఎం 3.0కు విస్తృత ఏర్పాట్లు

- చిలకలూరిపేట శారదా స్కూల్లో పాల్గొంటున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ కృతికా శుక్లా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పాఠశాల పండుగకు విద్యాలయాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూల్స్, కళాశాలల్లో శుక్రవారం పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 3.0 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. చిలకలూరిపేటలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే పీటీఎంకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరు కానున్నారు. ఆయన పర్యటన సందర్భంగా స్కూల్‌లో భారీగా ఏర్పాట్లు చేశారు. డీఆర్‌వో మురళీ, డీఈవో చంద్రకళ, ఆర్డీవో మధులత స్కూల్‌ను గురువారం సందర్శించారు. సభావేదిక, వాహనాల పార్కింగ్, తాగునీటి వసతి, పరిశుభ్రత అంశాలపై సమీక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో రెండో విడత తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల నిర్వహణకు 1,530 విద్యా సంస్థల్లో ఏర్పాట్లు చేశారు. 1,44,672 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన నున్నారు.



చిలకలూరిపేట శారద స్కూల్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు, డీఈవో చంద్రకళ, ఆర్డీవో మధులత

పిల్లల ప్రోగ్రెస్ తల్లిదండ్రులకు..

విద్యాలయాల్లో తల్లితండ్రుల భాగస్వామ్యం కల్పించడమే పీటీఎం లక్ష్యం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామపెద్దలు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధు లు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్, సభ్యులు, అధికారులు అందరూ పాల్గొంటారు. పీటీఎంలో పిల్లల ప్రగతిపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చిస్తారు. పిల్లల అకడమిక్ అభివృద్ధిని తెలియజేస్తారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తల్లిదండ్రులతో పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చిస్తారు.

నిర్వహణ ఇలా..

పీటీఎంను ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం (మిగతా 6వ పేజీలో)



ట్రాక్టర్ ఎక్కితేనే బడికి..

వినుకొండటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకనకొండ విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే ఇసుక ట్రాక్టర్లను ఎక్కాల్సి వస్తుంది. సమయపాలన లేని ఆర్టీసీ బస్సులతో విద్యార్థులు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు నాగులవరంలోని జడ్పీహెచ్ పాఠశాలలో చదువుకుంటున్నారు. అయితే పాఠశాల సమయానికి బస్సు రాకపోవడంతో గుండ్లకమ్మ నుంచి ఇసుకతో వెళ్లే ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయి నిర్మాణాలకే..

రెండో దఫా భూ సమీకరణ

\- మంత్రి నారాయణ

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరాలతో సమానంగా నిర్మించేందుకు అవసరమైన అంతర్జాతీయ స్టేడియం, ఎయిర్‌పోర్ట్, స్మార్ట్ సిటీ, రైల్వేలైను, ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మాణానికి భూమిని సమీకరించేందుకు రెండవ దఫా భూ సమీకరణకు క్యాబినెట్ ఆమోదించిందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కె.నారాయణ అన్నారు. భూ సమీకరణ చేయనున్న గ్రామాలలో ఒకటైన యండ్రాయిని గురువారం మంత్రి నారాయణ స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ భూ సేకరణ చేపట్టాలని నిర్ణయం తీసు కుంటే.. స్థానిక పెదకూరపాడు, తాడికొండ ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, శ్రావణ్ కుమార్ అభ్యంతరం తెలిపి.. రైతులు నష్టపోతారని భూ సమీకరణ ద్వారా భూములను తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. దీనికి సీఎం చంద్ర బాబు అంగీకరించారని తెలిపారు. గతంలో సమీకరించిన 29 గ్రామాల్లోని భూమి పెద్ద ప్రాజెక్టులకు అవసరమైన ఎక్కువ మొత్తంలో అందుబాటులో లేకపోవడంతో ఏడు గ్రామాలలో 16 వేల ఎకరాలు భూ సమీకరణ చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. రైతు కూలీలకు కూడా నెలనెల పెన్షన్, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి నారాయణ వెల్లడించారు. సమావేశం అనంతరం రైతు నంబూరి తులసిబాబు(బలరాం) యండ్రాయిలో ఉన్న తన నాలుగు ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇస్తున్నట్లు సంబంధిత ధ్రువీ కరణ పత్రాలను మంత్రి నారాయణకు ఎమ్మెల్యే ప్రవీణ్ చేతుల మీదుగా అందజేశారు. సమావేశంలో ఆర్డీఓ రమణాకాంత్ రెడ్డి, అధికారులు, రైతులు, పాల్గొన్నారు.



మంత్రి నారాయణకు నాలుగు ఎకరాల భూమికి చెందిన దస్తావేజులు అందజేస్తున్న బలరాం

మినీ కలెక్టరేట్లు ప్రారంభం

- జిల్లాలో డీడీవో కార్యాలయాలు
- వర్చువల్‌గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీ రాజ్ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల పంచాయతీల్లో గ్రేడ్‌ల విధానాన్ని అమల్లోకి తీసుకురాగా.. తాజాగా డివిజన్ స్థాయిలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీడీవో)లను నియమించారు. డీడీవోలకు నూతన కార్యాలయాలను ఏర్పాటు చేశారు. నరసరావుపేట, సత్తెన పల్లి, గురజాల డీడీవో కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. వీటిని ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. గురజాల డీడీవో కార్యాలయ ప్రాంభోత్సవంలో కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, సాగర్ పాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు పాల్గొన్నారు. నరసరావుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, సత్తెనపల్లిలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నరసరావుపేట డీడీవోగా ఎం.వెంకటరెడ్డి, గురజాల డీడీవోగా గబ్రూనాయక్, సత్తెనపల్లి డీడీవోగా రాజగోపాల్ బాధ్యతలు స్వీకరించారు.



గురజాలలో డీడీవో కార్యాలయం ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

నరసరావుపేట లింగంగుంట్లలోని సచివాలయం రెండులో తాత్కాలికంగా డీడీవో కార్యాలయం ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి, గురజాలలోని పంచాయతీరాజ్ అతిథి గృహాల్లో డీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేశారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారుల కు ప్రభుత్వం విశేష అధికారాలను అప్పగించింది. ఆర్డీవోకు సమానమైన వీటిని కల్పించారు. డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామాణాభివృద్ధి విభాగాలను డీడీవోలు నియంత్రిస్తారు. అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యాక్రమాలను పర్యవేక్షి స్తారు. ప్రతి నెలా కనీసం 20 రోజులు పంచాయతీల్లో పర్యటించి టూర్ డైరీల ను కలెక్టర్లకు సమర్పించాల్సి ఉంటుంది. ఎంపీడీవోలతో పాటు డివిజన్ స్థాయిలో పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సిబ్బంది మొత్తం డీడీవో నియంత్రణలో పని చేస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పటి వరకు అథారిటీలుగా ఆర్డీవోలు ఉండేవారు. ఇక నుంచి డీడీవోలకు ఆ బాధ్యతలు అప్పగించనున్నారు. పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి సూచికల పురోగతిని సమీక్షిస్తారు. పన్ను వసూళ్లు, శానిటేషన్, తాగునీటి సరఫరా, పంచాయతీల ఆస్తుల పరిరక్షణ, స్థలాల ఆక్రమణల తొలగింపు వంటి 16 రకాల అధికారాలను డీడీవోలకు కల్పించారు. పంచాయతీల్లో ఉపాధి పనులు పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరిస్తారు. జిల్లాలో ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో డీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేశారు.

రైతు ద్రోహి జగన్.. దమ్ముంటే అసెంబ్లీకి రావాలి

● రైతు బాంధవుడు చంద్రబాబు: చీఫ్ విప్ జీవీ



మాట్లాడుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

ఈపూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతు ద్రోహిగా పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్‌రెడ్డి చరిత్రకెక్కాడని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు. రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు ఇవ్వకుండా వారిని అన్ని విధాలుగా దోపిడీ చేస్తూ దోపిడీదారుడుగా మిగిలిపోయారని ఆరోపించారు. గ్లోబల్ ప్రచారంతో మోసపూరితమైన మాటలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కిరాయి మీడియాను ఉపయోగిస్తున్నాడని ఆయన మండిపడ్డారు. రైతు బాంధవుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును తప్పుగా మాట్లాడుతూ రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలను సైంధవుడులా అడ్డుకుంటున్నారని జీవీ దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నాడని ఆగ్రహించారు. జగన్ కళ్లుండి గుడ్డివాడిలా మాట్లాడుతున్నాడన్నారు. చంద్రబాబునాయుడు నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం శతవిధాల పని చేస్తుంటే ప్రజల్లోకి రావడానికి జగన్ భయపడుతున్నాడని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పరదాలు చాటున బయటకు వచ్చే జగన్‌కు చంద్రబాబుపై అసత్య ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నర్రా కిషోర్, ఈపూరు సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు, పెమ్మసాని నాగేశ్వరరావు, బొల్లా వెంకట కోటయ్య, రాజేశ్వరి ఉన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోలకు పోస్టింగ్

● ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు గ్రేడ్‌లు కేటాయించిన నేపథ్యంలో డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించిన అధికారులకు గురువారం పోసింగ్ ఇస్తూ కలెక్టర్ కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 28 మంది డిప్యూటీ ఎంపీడీవోలకు మండలాలను కేటాయించారు. చిలకలూరిపేట డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్.రామ బ్రహ్మనాయుడు నియమితులయ్యారు. అలాగే యడ్లపాడు మండలానికి పీవీ నాగిరెడ్డి, నాదెండ్లకు ఎస్.వెంకట్రావు, నరసరావుపేట జి.వెంకటపతి, రొంపిచర్ల ఎస్‌వీ కోటేశ్వరరావు, అచ్చంపేట కె.శ్రీనివాసరావు, బెల్లంకొండ రామావత్ నరసింహనాయక్, క్రోసూరు షేక్ మహబూబ్ సుభాని డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. పెదకూరపాడు మండలానికి ఎస్.విజయశ్రీ, రాజుపాలెం ఎస్.శ్యాంప్రసాద్, నకరికల్లు ఎ.సాయికృష్ణ, ముప్పాళ్ల, కె.వెంకటశివ ప్రసాద్, సత్తెనపల్లి ఎ.కిషోర్‌బాబు, బొల్లాపల్లి పి.ఆదినారాయణ, ఈపూరు పి.ఉపేంద్ర హరిశ్రీనివాసరావు, నూజెండ్ల పి.మల్లికార్జునరావు, శావల్యాపురం ఎం.ఆంజనేయప్రసాద్, వినుకొండ జి.బాల కోటేశ్వరరావు, దాచేపల్లి బి.సాంబిరెడ్డి, గురజాల పి.విశ్వరూపాచారి, మాచవరం పి.ఉషారాణి, పిడుగురాళ్ల కె.స్వామి నాయక్, కారంపూడి ఎన్.శ్రీనివాసరెడ్డి, రెంటచింతల ఎస్.జయబాబు, దుర్గి టీవీవీ ప్రసాద్, మాచర్ల పి.శ్యాంసుందర్, వెల్దుర్తి మండలం డిప్యూటీ ఎంపీడీవోగా ఎం.శ్రీనివాసరావు నియమితులయ్యారు.

వైభవంగా పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో పాతపాటేశ్వరి



డీడీవో కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యరపతినేని, కృతికాశుక్లా

గురజాలటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న శ్రీ పాతపాటేశ్వరి అమ్మవారి 427 తిరునాళ్ల మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు తెల్లవారుజాము నుంచే బోనాలతో ఆలయానికి చేరుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శిడిమాను ఉత్సవం జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈవో పూర్ణచంద్రబాబు, పట్టణ సీఐ భాస్కర్ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. పాతపాటేశ్వరి అమ్మవారి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈవో పూర్ణచంద్రరావు అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, డీఎస్పీ జగదీష్, నాగార్జున సాగర్ కుడి కాలువ ఛైర్మన్ పులుకూరి కాంతారావు, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నేలవల్లి బొల్లయ్య, యేచూరి సతీష్, నవులూరి శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. పదో అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డీడీవో కార్యాలయం ప్రారంభం

పట్టణంలో నూతనంగా నిర్మించిన డీడీవో (డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి) కార్యాలయాన్ని ఎమ్మెల్యే యరపతినేని, కలెక్టర్ కృత్తికా శుక్లా ప్రారంభించారు. వర్చువల్ విధానంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ డీడీవో కార్యాలయాల ప్రారంభోత్సవాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీ రాణి, డీఎల్‌డీవో గఫూనాయక్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

● 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్



మాట్లాడుతున్న లంకా దినకర్, పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవా

గుంటూరు(తూర్పు), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవాలని 20 సూత్రాల అమలు కార్యక్రమం ఛైర్మన్ (స్వర్ణాంధ్ర - వికసిత్ భారత్) లంకా దినకర్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారీయా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవాతో కలిసి వైద్య, ఆరోగ్య, విద్యా శాఖ, మౌలిక సదుపాయాల కల్పన శాఖలతో ఆయన సమీక్షించారు. పీఎం మాతృవందన యోజన, జననీ సురక్షా యోజన (జేఎస్‌వై), జననీ శిశు సంరక్ష, రాష్ట్రీయ కిషోర్ స్వస్థ కార్యక్రమం (ఆర్కేఎస్‌కే), రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్బీఎస్కే), ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, ఎన్టీఆర్ వైద్య సేవ, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, పీఎం శ్రీ తదితర పథకాలతో పాటు జల్ జీవన్ మిషన్, అమృత్ పథకాలకు సంబంధించిన అంశాలపై సమీక్షించి, పురోగతికి అవసరమైన కార్యాచరణపై సూచనలు చేశారు. ఆయుష్మాన్ భారత్‌లో నమోదు సంఖ్య మరింతగా పెరగాలని సూచించారు. 70 ఏళ్లు దాటిన వారి ఇంటి వద్దే రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. మాతా, శిశు మరణాల రేటును తగ్గించేందుకు అధికారులు కృషి చేయాలని దినకర్ కోరారు. తల్లికి వందనం, ఎన్టీఆర్ క్యాంటీన్లతో పిల్లల బడి బాట పట్టారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో పీఎం శ్రీ పాఠశాలలపై త్వరలోనే ఆకస్మిక తనిఖీలు చేపడతామని స్పష్టం చేశారు. జిల్లాలో అమృత్-2 కింద నగరంలోని గోరంట్ల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు నిధులను మంజూరు చేసామని, త్వరలోనే పనులను ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలీ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కల్యాణ చక్రవర్తి, డీపీఓ శేష శ్రీ, ఐసీడీఎస్ పీడీ జ్ఞాన ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగా జిల్లా ఆరోగ్యం

20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్ వెల్లడించిన రక్త నమూన పరీక్షల ఫలితాల గణాంకాలు ఆందోళన కరంగా ఉన్నాయి. జిల్లాలో 85,348 సాధారణ రక్తపరీక్షలు నిర్వహించగా 1,054 మందికి, 33,304 గర్భిణులకు పరీక్షలు చేయగా 25 మందికి హెచ్ఐవీ పాజిటివ్ వచ్చిందన్నారు. 59, 228 యూనిట్ల రక్తాన్ని సేకరించగా అందులో 69 అనుమానాస్పద రక్త నమూనాలను పరీక్షలకు పంపగా 15 యూనిట్లలో హెచ్ఐవీ కనపడిందని, దీనిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో 19 -45 మధ్య వయస్సు ఉన్నవారిలో 2025-26కు 3,353 అనీమియా కేసులు గుర్తించినట్టు చెప్పారు. 18 ఏళ్లు పైబడిన వారు 17.95 లక్షల మంది ఉంటే ఓరల్ క్యాన్సర్ 205, రొమ్ము క్యాన్సర్ 508, సెర్వికల్ క్యాన్సర్ 307 మందికి ఉన్నట్టు తెలిపారు. మొత్తం జిల్లాలో 22.42 లక్షల జనాభాలో ప్రస్తుతం 4,339 టీబీ కేసులు ఉండగా, 83 మంది మరణించారని, హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న టీబీ కేసులలో 8 మంది మరణించారని, ఇతర కారణాలుతో టీబీ కేసులు 92 ఉంటే అందులో 6 మంది మరణించారని వివరించారు. జిల్లాలో మొత్తం 9.09 లక్షల అర్హులైన వారికి ఇప్పటివరకు 8.79 లక్షల పీఎంజేఏవై కార్డులు పంపిణీ చేశామన్నారు. 70 సంవత్సరాలు పైబడిన వారు 1.55 లక్షల లబ్ధిదారులు ఉంటే ఇప్పటి వరకు 14.50 వేల మంది మాత్రమే కార్డులు తీసుకున్నారని వివరించారు. స్కూల్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమం క్రింద జిల్లాలో 360 పాఠశాలలో కంటి పరీక్షలను 43,950 మందికి చేయగా, 3147 మందికి కళ్లజోళ్లు అందిచినట్లు చెప్పారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం

విజయపురిసౌత్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 579.20 అడుగులు ఉంది. ఇది 280.69 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6097 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బిసి ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 16,797 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,797 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 43.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నాయి. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

జడ్పీ ఛైర్‌పర్సన్‌కు ఊరట



హెనీ క్రిస్టీనా

తెనాలి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనాపై అభియోగాన్ని సివిల్ జడ్జి కోర్టు గురువారం తోసిపుచ్చింది. పట్టణానికి చెందిన మంద్రు సరళకుమారి అనే మహిళ 2022 జడ్పీటీసీ ఎన్నికల్లో క్రిస్టీనా ఎస్‌సి కాదని, నలుగురు సంతానం ఉన్నారంటూ కోర్టులో కేసు వేశారు. విచారణ అనంతరం జడ్జి పవన్‌కుమార్ పిటిషన్‌ను కొట్టివేశారు.

ఆసుపత్రికి తాళం.. సిబ్బంది సస్పెన్షన్

● ఇద్దరు డాక్టర్లు సహా 12 మందిపై వేటు
● కమిషనర్ ఆకస్మిక తనిఖీలో బయటపడిన నిర్వాకం



తాళం వేసిన గణపవరం పీహెచ్‌సీ

గుంటూరు సిటీ, నాదెండ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోయిన వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందిపై వేటుపడింది. పల్నాడు జిల్లా గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లు సహా 12 మంది సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఆరోగ్యశాఖ డైరెక్టర్ కె.పద్మావతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్ గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 24 గంటల పాటు తెరిచి ఉంచాల్సిన ఆసుపత్రికి తాళాలు వేసి ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ఆసుపత్రి సిబ్బంది పై చర్యలకు ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న డాక్టర్ కవిత అనసూయదేవి, డాక్టర్ ఎల్.ప్రసాద నాయక్, ఎంపీహెచ్ఈఓ కె.శ్రీనివాస్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ అంజమ్మ, సీనియర్ అసిస్టెంట్ బి.హనుమంతనాయక్, స్టాఫ్ నర్సులు బి.అరుణ, ఎస్.విజయ, ఎస్కే మస్తాన్ బీ, ల్యాబ్ టెక్నీషియన్ అరుణకుమారి, సూపర్వైజర్లు షేక్ రెహ్మాన్ బాషా, జానకీ దేవి, ఎఫ్ఎన్ఓపీ ఎస్.పుట్టలమ్మను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సస్పెండ్ అయిన వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందిని హెడ్ క్వార్టర్ వదిలి వెళ్లొద్దని ఆదేశాల్లో పేర్కొన్నారు. వారి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పల్నాడు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రవిని హెల్త్ డైరెక్టర్ ఆదేశించారు.

డిప్యూటేషన్‌పై సిబ్బంది

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సస్పెండైన సిబ్బంది స్థానంలో కొత్తగా సిబ్బందిని నియమించారు. డాక్టర్ హరిహరణ్, డాక్టర్ ఎస్కే సుమియా, స్టాఫ్ నర్సులు నాగరాజు, సురేఖ, కృష్ణవేణి, ల్యాబ్ టెక్నీషియన్‌గా సతీష్, ఎంపీహెచ్ఈఓగా శేషగిరి, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి, సూపర్వైజర్ బాలకోటేశ్వరి భాయ్‌ని డిప్యూటేషన్‌పై గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపారు.

నేడు పాఠశాల పండుగ

(5వ పేజీ తరువాయి)

ఒంటి గంట వరకు జరుగుతుంది. తల్లిదండ్రులు విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం సహపంక్తిగా చేస్తారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను పంపిణీ చేస్తారు. పదవ తరగతి పరీక్షల సన్నద్ధతకు 100 రోజుల ఇంటెన్సివ్ యాక్షన్ ప్లాన్ గురించి తల్లిదండ్రులతో చర్చిస్తారు. డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో శారద జెడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎస్పీ కృష్ణారావు, డీఆర్వో మురళి, డీఈవో చంద్రకళ, ఆర్డీవో మధులత, డీఎస్పీ హనుమంతరావు గురువారం సందర్శించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఘన స్వాగతం పలకాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన నాయకులు ఎం.చరణ్ తేజ, తోట రాజా రమేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ బ్యాంకు, ఏడీబీ టెక్నికల్ మిషన్ ప్రారంభం

● వారం రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు, అధికారులు

తుళ్లూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), ఏపీ సీఆర్డీఏ జాయింట్ టెక్నికల్ మిషన్‌ను గురువారం సీఆర్డీఏ ప్రారంభించింది. ఈ కార్యక్రమం రాజధాని అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ వరకు వారం రోజులపాటు జరుగనుంది. ఇందులో అమరావతి సమీకృత పట్టణాభివృద్ధి కార్యక్రమం (ఏఐయూడీసీ) కింద రాజధాని నిర్మాణంలో భద్రతా ప్రమాణాల అమలు, భాగస్వాముల భాగస్వామ్యం, పీపీపీ ప్రణాళిక, కాంట్రాక్టుల నిర్వహణ, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన కార్యకలాపాలపై చర్చలు జరుగుతాయి. తొలిరోజైన గురువారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో లింగ ఆధారిత హింస (జీబీవీ) లైంగిక దోపిడీ, వివక్ష (ఎస్ఈఏ), లైంగిక వేధింపులు (ఎస్‌హెచ్) అనే అంశాలపై ప్రపంచ బ్యాంకు, ఏడీబీ బృందంలో ప్రపంచ బ్యాంకు సీనియర్ జెండర్ స్పెషలిస్ట్ జయా శర్మ, జీబీవీ కన్సల్టెంట్ శృతి మున్ని, గుంటూరు వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సెలర్ విజయలక్ష్మి, సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారుల, కాంట్రాక్టర్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దాచేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ నూతన లైన్ల నిర్మాణం చేస్తూ ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో జరిగింది. గురువారం దాచేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెదగార్లపాడు సమీపంలో 133కేవీ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కరెంటు వైర్లు లాగుతుండగా ప్రమాదవశాత్తు హెవీ లైన్ తగలటంతో తెలంగాణలోని కొత్తగూడెం జిల్లా సత్యనారాయణపురం గ్రామానికి చెందిన బోరారు రుకమద్(29) అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

594 కేజీల గంజాయి ధ్వంసం



పశ్చిమ గోదావరి ఎస్పీ బద్నాన్ నయీం అస్మి ఇతర అధికారులు

యడ్లపాడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమగోదావరి జిల్లాలో పట్టుబడిన గంజాయిని ఆ జిల్లా పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ బద్నాన్ నయీం అస్మి ఛైర్మన్‌గా ఉన్న డ్రగ్స్ డిస్పోజబుల్ కమిటీ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 21 కేసులలో పట్టుబడిన 594.84 కిలోల గంజాయిని గట్టి బందోబస్తు నడుమ యడ్లపాడు మండలం కొండవీడు రెవెన్యూ పరిధిలోని జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటుకు తరలించారు. జిందాల్ పవర్ ప్లాంటులోని రెండవ బాయిలర్‌లో గంజాయి వేసి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్లాంటు ప్రెసిడెంట్ ఎంవీ చారికి, సిబ్బందికి, ఈగల్, ఎక్సైజ్, రెవెన్యూ, ఫైర్, పొల్యూషన్ అధికారులకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరిజిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, భీమవరం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.కాళీచరణ్, ఈగల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవీంద్ర, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి, డీసీఆర్‌బీ ఎస్సై విక్రమ్ పాల్గొన్నారు.

మేనమామ అప్పు తీర్చి.. మేనల్లుడి ఆత్మహత్య



షేక్ అహ్మద్ (ఫైల్ ఫొటో)

పెదకాకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మేనమామ మోసగించడంతో మేనల్లుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తక్కెళ్లపాడులో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. తక్కెళ్లపాడుకు చెందిన షేక్ అహ్మద్(26) అనే యువకుడు అదే గ్రామంలో ఉంటున్న తన మేనమామ ఆర్థిక ఇబ్బందులు తీర్చాడు. ప్రైవేట్ ఫైనాన్స్‌లో తన ఇల్లు తాకట్టు పెట్టి రూ.4లక్షలు మేనమామకు ఇచ్చాడు. రుణానికి సంబంధించిన కిస్తీలను తన మేనమామ కట్టకపోవడంతో మనస్థాపానికి గురైన అహ్మద్ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన మృతికి కారణం తన మేనమామేనని సూసైడ్ నోట్ రాశాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏఈ పెద్ద మస్తాన్



లంచం నగదుతో పట్టుబడ్డ ఏఈ పెద్ద మస్తాన్

కారంపూడి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారంపూడి విద్యుత్ శాఖ ఏఈ కె.పెద్ద మస్తాన్ రూ.25వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహీందర్ నేతృత్వంలోని బృందం గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆయనను అదుపులోకి తీసుకుంది. కారంపూడికి చెందిన మస్తాన్‌వలిని ఇంజనీరింగ్ వర్క్స్ షాపునకు సంబంధించి కేటగిరి-2 మీటరు కోసం మూడు నెలల నుంచి తిప్పుకుంటూ.. విద్యుత్ శాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నారు. మీటరు ఇవ్వడానికి డబ్బులు కూడా డిమాండ్ చేయడంతో మస్తాన్‌వలి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏఎస్పీ మహీందర్ విలేకరులతో మాట్లాడుతూ పట్టుబడ్డ ఏఈ పెద్ద మస్తాన్ గతంలో రాజుపాలెం, మాచవరం మండలాల్లో పనిచేశారన్నారు. ఎవరైనా లంచం అడిగితే బాధితులు 1064 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు నాగరాజు, మన్మథరావు, ఎస్ఐలు సతీష్‌బాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

45,479 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 42,461 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,479 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,854 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000	334	10500	16700
నెంబరు. 5	11500	15500	నెంబరు. 5	11000	15300
273	---	---	273	---	---
341	10500	16800	341	12000	17000
4884	---	---	4884	12000	14200
సూపర్ 10	---	---			
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15500	తేజ	11000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి 355	11000	17200
బ్యాడిగి	10500	17100	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	11000	16500	తాలుకాయలు	5000	7800
ఆర్మూరు	10500	13300			

రూ.20 ఇస్తే.. పాస్

(5వ పేజీ తరువాయి)

వివరాలు నిర్ధారించకపోతే సీసీఐ కేంద్రంలోకి ప్రవేశించే అవకాశం ఉండదు. రైతుల ఇటువంటి అవసరాన్ని ఆధారం చేసుకొని క్వింటాల్‌కు రూ. 20 ఇస్తేకానీ, పత్తి లోడ్‌ను పాస్ చెయ్యమని సిబ్బంది తెగేసి చెబుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వే బ్రిడ్జి బరువు ఆధారంగా నగదు ముందే వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన ప్రతి రైతు కనీసం రూ. 200 నుంచి రూ.400 వరకు చెల్లించి లోపలికి వెళ్లాల్సి వస్తుందని అంటున్నారు. గతంలో కూడా ఇదే వ్యవహారంపై దుమారం రేగింది. మార్కెటింగ్ సిబ్బంది చేస్తున్న వసూళ్ల దందాపై ఒక వ్యక్తి రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు. ప్రతి సంవత్సరం ఈ విధానంలో భారీ మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

రూ. 20 అంటే సామాన్యం కాదు

సీసీఐ కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి క్వింటాల్ పత్తికి రూ. 20 వసూలు చేస్తున్నారన్నది చిన్న విషయంగా తోచినా.. సీజన్ మొత్తంలో అది పెద్ద మొత్తం గానే కనిపిస్తుంది. ఉదాహరణకు గతేడాది ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 9.50 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. అప్పుడు కూడా క్వింటాల్‌కు రూ. 20 వసూలు చేసినట్లు పలువురు మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ లెక్కన గత ఏడాది సుమారుగా రూ. 1.90 కోట్లు వసూలు చేసినట్లు స్పష్టం అవుతుంది. ఇలా వసూలు చేసే సొమ్ము ఆ శాఖ లోని కీలకమైన వారి వద్దకు చేరుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. అందువల్ల ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అవి బుట్టదాఖలు అన్నట్లుగానే ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

అనుమతి లేకుండా విత్తనాలు అమ్మితే కేసులు

నకరికల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఎవరైనా విత్తనాలు అమ్మితే కేసులు నమోదుచేస్తామని ఏవో కే దేవదాసు హెచ్చరించారు. గురువారం నకరికల్లులోని విత్తనాల దుకాణాన్ని ఏవో తనిఖీ నిర్వహించారు. గోడౌన్‌లలోని విత్తనాల నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపినట్టు తెలిపారు. వీఏఏ వై ప్రభాకర్ పాల్గొన్నారు.

అదనపు లోడును క్రమబద్ధీకరించుకోండి

● ఏపీసీపీడీఎల్ ఏడీఈ జీ వెంకటేశ్వరరెడ్డి

నకరికల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు 50శాతం రాయితీతో విద్యుత్ అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవచ్చని ఏపీసీపీడీసీఎల్ ఏడీఈ భవనం వెంకటేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కిలోవాట్‌కు పూర్తిధర రూ.2,250 కాగా రూ.వెయ్యి రాయితీతో రూ.1250 చెల్లించాలని, రెండు కిలోవాట్లకు రూ.2450, మూడు కిలోవాట్లకు రూ.3,650, 4కిలోవాట్లకు రూ 4,850, ఐదు కిలోవాట్‌కు రూ 6,050 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు.

14న ఏపీఆర్‌జేసీలో స్వర్ణోత్సవం

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్‌జేసీ కళాశాలలో ఈనెల 14వ తేదీన సర్ణోత్సవం నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఏపీఆర్ ఈఐఎస్ సెక్రటరీ మస్తానయ్య హాజరుకానున్నారు. ఈ మేరకు గురువారం కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజిని, సైదారెడ్డి, నాగాచారి, వీరనంది, గోపాలరావు, రమేష్‌నాయుడు, వంశీకృష్ణ పాల్గొన్నారు.

దుర్గమ్మకు యరపతినేని పూజలు

పిడుగురాళ్ల: స్థానిక కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో గురువారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీ నివాసరావు పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భవానీ స్వా ములు హోమ గుండం ఏర్పాటుచేయగా ఎమ్మెల్యే పాల్గొన్నారు.

నేడు కుంకలగుంటలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నకరికల్లు: విద్యుత్ అత్యవసర మరమ్మతులు నిమిత్తం శుక్రవారం కుంకలగుంటలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఏఈఈ జీ సుచరిత తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని ఆమె కోరారు.

పంచాయతీ భవనానికి రూ.32లక్షలు మంజూరు

తురకపాలెం గ్రామ పంచాయతీ భవననిర్మాణానికి రూ.32లక్షల నిధులు మంజూరైనట్టు పంచాయతీరాజ్ ఏఈ బేతంచర్ల నాగేశ్వరరావు గురువారం తెలిపారు. త్వరలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్టు వివరించారు.

అన్న క్యాంటీన్‌లో భోజనం పరిశీలన

సత్తెనపల్లి: నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ బృందం గురువారం మధ్యాహ్నం అన్న క్యాంటీన్‌లో భోజనాన్ని పరిశీలించింది. భోజనం నాణ్యత, లోపాలు తదితర వివరాలను బృందం సభ్యులు భోజనం చేస్తున్నవారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీ వీరాంజనేయులు, ఎం నాగసాయి, బీ షారోన్‌కుమార్, సాంబశివరావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

నకరికల్లు: కుంకలగుంటలో పిచ్చి కుక్క దాడి చేయటంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బుధ, గురువారాల్లో గ్రామంలోకి వచ్చిన పిచ్చికుక్క నలుగురిని కరిచింది.

జగనన్న కాలనీల ఇంటి మెరక తోలకంపై విచారణ

గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలకు మెరక తోలేందుకు ఖర్చుచేసిన నిధుల వినియోగంపై ఉపాధి అధికారుల బృందం గురువారం నకరికల్లు ఉపాధి కార్యాలయంలో విచారణ చేపట్టారు. 19పనులకు అంచనాలు, నిధుల ఖర్చు, ఎంత చెల్లించాల్సి ఉంది.. అనే అంశాలపై రికార్డులను పరిశీలించారు.

బాల్య వివాహాలు సాంఘిక దురాచారం

అచ్చంపేట: బాల్యవివాహాలు సాంఘిక దురాచారమని తాళ్ళచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తుమ్మా శౌరిరెడ్డి అన్నారు. గురువారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా తల్లులు, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు, కిషోరి బాలికలతో అంగన్‌వాడీ సూపర్వైజర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్ మాణిక్యమ్మ, పాల్గొన్నారు. వేల్పూరులో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు సీసీ రోడ్డు నిర్మాణం

క్రోసూరు: క్రోసూరులోని మోడల్ స్కూల్‌కు ప్రధాన రహదారి నుంచి సుమారు కిలోమీటరు సీసీ రోడ్డు నిర్మించారు. గత సంవత్సరం పాఠశాలలో జరిగిన మెగా పేటీఎంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల వినతి మేరకు ఎమ్మెల్యే ఈ రహదారి నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు అధికారులు సీసీరోడ్డు నిర్మాణం పూర్తిచేశారు.

ఎర్రబాలెంను ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలి

క్రోసూరు శివారు గ్రామం ఎర్రబాలెంను ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని కోరుతూ గ్రామస్తులు గురువారం ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికే రెండుసార్లు కలెక్టర్‌కు, డీపీవోకి వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. క్రోసూరు ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకి ఈ విషయాన్ని వివరించామన్నారు. గ్రామస్తులు తిమ్మిశెట్టి హనుమంతరావు, శ్రీనివాసరావు, ఏడుకొండలు, గోపీ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పాటిబండ్లలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

పెదకూరపాడు: ప్రేమ, సేవలే క్రిస్మస్ అర్థమని గుంటూరు నగరంపాలెం పునీత అంతోని పుణ్యక్షేత్రం పాస్టర్ అల్లం శౌరిరెడ్డి అన్నారు. మండలంలోని పాటిబండ్ల కారుణ్య వృద్ధాశ్రమంలో గురువారం సెమీక్రిస్మస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు, పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో ప్రకాశరావు, సుదర్శన్, సుదీర్, దేవయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు చేయూతనివ్వాలి

రెంటచింతల: వర్షపునీరు పాఠశాలలోకి చేరుతోందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును మంచికల్లు పాఠశాల టీచర్లు కోరారు. గురువారం స్వగ్రామానికొచ్చిన ఎమ్మెల్యేని ఎంఈవో 2 శివనాగేశ్వరరావు,జడ్పీ హైస్కూలు టీచర్లు ఘనంగా సత్కరించారు. పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మించాలని, వంట గది, రెండు తరగతి గదులను నిర్మించాలని వారు కోరారు. సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నేడు అభివృద్ధి పనులకు భూమిపూజ

దుర్గి: దుర్గిలో శుక్రవారం రూ.70 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి భూమిపూజ చేయనున్నట్లు టీడీపీ నేతలు సూరె వెంకటేశ్వర్లు, వై.గోపాల్, కోట వీరయ్య చౌదరి తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ డీఎంఎఫ్ కింద రూ.30లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.20లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారన్నారు. కార్యక్రమంలో సింగు నాగేశ్వరరావు, ఆకుల చినచెన్నయ్య పాల్గొన్నారు.

నేడు మెగా పీటీఎం

పిడుగురాళ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పీటీఎం జరుగనున్నది. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురజాల మండలంలోని పులిపాడు జడ్పీ పాఠశాలలో జరిగే సమావేశానికి హాజరుకానున్నారు.

● నకరికల్లు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పీటీఎం 3.0 సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నారని ఎంఈవో ఏసుబాబు గురువారం తెలిపారు.

● బెల్లంకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ కవిత తెలిపారు.

● దుర్గి: స్థానిక జడ్పీ హైస్కూల్, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లో శుక్రవారం మెగా పీటీఎం-3 నిర్వహించనున్నారు.

వైభవంగా మంచికల్లు పోలేరమ్మ తిరునాళ్ల

● కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేల ప్రత్యేక పూజలు



తిరునాళ్లలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

రెంటచింతల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచికల్లు గ్రామ తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. వేకువజామునుంచే పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పోలేరమ్మ తల్లికి మహిళలు పొంగళ్లను సమర్పించారు. సాయంత్రం గ్రామవీధుల్లో శిడిమాను ఊరేగించారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యుద్దీప కాంతులతో ఆలయం శోభిల్లింది. గురజాల డీఎస్పీ జగదీష్ నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ బి.కృష్ణారావు, గురజాల, మాచర్ల ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు తిరునాళ్ల వేడుకల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవతకు సారే సమర్పించారు.



మంచికల్లు తిరునాళ్లలో శిడిమానును ఊరేగింపు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలు 30 అర్జీలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి, షేక్ సుభానిసాహెబ్, బృంగా రమణ, కొమెర శివ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత

మాచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. 46మందికి రూ.38.70లక్షల చెక్కులను అందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా సమస్యలు పరిష్కరించండి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజాసమస్యలను పరిష్కారంలో బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం మండలంలోని ఎండ్రాయిలో వంద రోజులు వంద గ్రామాలు కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు ఎమ్మెల్యే ప్రవీణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు వివిధ సమస్యలపై 85అర్జీలు ఎమ్మెల్యేకి అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. భూ సమీకరణ జరిగే నాలుగు గ్రామాలలో ప్రజాసమస్యలు సంపూర్ణంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డానియేలు, ఎంపీడీఓ శివపార్వతీ, ఏఓ అహ్మద్, ట్రాన్స్‌కో ఏఈ రవికిరణ్, ఎంఈఓ శివబాబు, వలివేటి ధర్మారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యే ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరులో బుధవారం రాత్రి జరిగిన అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, టీడీపీ నాయకురాలు వేగుంట రాణి పాల్గొన్నారు.



అమరావతి: ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గానికి చెందిన పలువురు తమ సమస్యలపై ఎమ్మెల్యేకి వినతిపత్రాలు అందించారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను కన్నా ఆదేశించారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

డీడీవో కార్యాలయం ప్రారంభం

స్థానిక గుంటూరు రోడ్డులో ఉన్న పంచాయతీ రాజ్ గెస్‌హౌస్‌లో డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేందుకు కార్యాలయం ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. డీడీవో కార్యాలయ అధికారి డివిజన్‌లోని సచివాలయాల పర్యవేక్షణ, ప్రజలకు వేగంగా సేవలందేలా చూస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ ఛైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు, డీడీవో రాజగోపాల్, చౌట శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, కనుమూరి బాజీచౌదరి, గోగినేని కోటేశ్వరరావు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



పెదకూరపాడు: దత్త జయంతి పూజల్లో పాల్గొన్న భక్తులు

కారంపూడి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్ల సమీపంలో శ్రీధనమల్లయ్యస్వామి ఆలయంలోని శ్రీదత్తాత్రేయస్వామిని గురువారం దత్తజయంతి సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పంగులూరి పుల్లయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు. శ్రీధనమల్లయ్యస్వామి ఆలయ పునఃనిర్మాణానికి రూ.5కోట్లు, ఉపాలయాల జీర్ణోద్ధరణకు మరో రూ.5కోట్లు మంజూరు చేయాలని దేవదాయ శాఖకు ప్రతిపాదనలు పంపించామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు.

● పిడుగురాళ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయస్వామి జయంతి సందర్భంగా పట్టణంలోని షిరిడీ సాయిరామ్ మందిరంలో గురువారం గణపతి, దత్తాత్రేయ, సాయిబాబాలకు పంచామృతాలతో అభిషేకం జరిగింది. అనంతరం స్వామివారి ఊరేగింపును దత్తాత్రేయ భక్తబృందం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహాఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు శ్రీరాం వెంకట శ్రీనివాసరావు, పచ్చిపులుసు రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు అయోధ్యస్వామి ఆశ్రమంలో గురువారం దత్తజయంతిని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అయోధ్యస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులచే సామూహిక అనగా వ్రతాన్ని స్వతంత్ర భారతి జరిపించారు. మధ్యాహ్న హారతి నిర్వహించి అన్నప్రసాదాలను ఏర్పాటుచేశారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ, రామకృష్ణలు పర్యవేక్షించారు.

ఎత్తిపోతలలో..

విజయపురిసౌత్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం ఎత్తిపోతలలో ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయంలో గురువారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకి సేవ వైభవంగా జరిపారు. వందలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. గురజాల డీఎస్పీ జగదీష్ పర్యవేక్షణలో విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్, 80మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తాళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యుడు బి.శ్రీరామ్ ఆధ్వర్యాన ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్, ఆలయ ధర్మకర్త బిట్టు నరసింహారావు, బిట్టు శ్రీనివాసరావు, నడ్డి పెద్దిరాజు, పసుపులేటి రోహిత్, పగడాల నాగేశ్వరరావు, బట్టు సత్యనారాయణ, తీర్థాల నాసరయ్య, కొండ సవరయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా ఆలయ అధికారులు భక్తులకు ఏర్పాట్లు సరిగా చేయకపోవడంపై వారు ఇబ్బందులకు గురయ్యారు.

● విజయపురిసౌత్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీసత్యసాయి ప్రేమ మందిరంలో గురువారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. దత్తాత్రేయస్వామి చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు జరిపారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



కారంపూడి: దత్తాత్రేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

క్రోసూరు హైస్కూల్‌లో పురాతన నాణాల ప్రదర్శన

క్రోసూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రోసూరు జడ్పీ హైస్కూల్‌లో గురువారం పురాతన నాణాల ప్రదర్శన నిర్వహించారు. ఔత్సాహిక నాణాల సేకరణకర్త తూమాటి శరత్ ఈ నాణాలను సేకరించి ప్రదర్శనలో ఉంచారు. మండల విద్యాశాఖ అధికారులు జీ కృష్ణ, ఎం గణేష్‌లు ప్రదర్శనను ప్రారంభించారు. తూమాటి శరత్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం 50 దేశాల నాణాలు, కరెన్సీని ప్రదర్శనలో ఉంచినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో మృతిచెందిన వ్యక్తి పిడుగురాళ్ళ వాసి

దాచేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలంలోని పొందుగుల కృష్ణా నది వద్ద నదిలో పడి మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తిని పోలీసులు గుర్తించారు. గురువారం తెలియజేస్తూ మృతుడు పిడుగురాళ్ళ పట్టణానికి చెందిన గూడుత్తి శేషగిరిరావు(62)గా గుర్తించారు. మృతుడికి కొంతకాలం క్రితం భార్య చనిపోవటంతో మతిస్థిమితం లేకుండా తిరుగుతూ నదిలో పడి మృతిచెందినట్టుగా వివరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్‌మేళాతో యువతకు ఉపాధి

పిడుగురాళ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు జాబ్‌మేళా నిర్వహించి యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో వున్నామని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ తమ్మాజీరావు తెలిపారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు సుమారు 282 మంది హాజరు కాగా 113 మందికి పది కంపెనీలలో ఉద్యోగ అవకాశాలతో నియామకపత్రాలను అందజేశారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట నరసయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పిడుగురాళ్లలో జాబ్‌మేళా నిర్వహించి పల్నాడు ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపడం ఎంతో మేలు కలుగుతుందన్నారు. జిల్లా ఉద్యోగ కల్పన అధికారి ఎం రవీంద్రనాయక్, పిడుగురాళ్ల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ పి శ్రీకాంత్, కిరణ్, రమ్య, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నియామకపత్రం అందజేస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు

రోశయ్యకు ఘన నివాళులు

పిడుగురాళ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో రోశయ్య విగ్రహానికి ఆర్యవైశ్యనేతలు పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో కనిగిరి శ్రీను, వనజా సాంబశివరావు, పిల్లి చెన్నారావు, చందోలు రామకృష్ణారావు, గుండా రామారావు, గర్రె నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని తాలూకా సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద ఆర్యవైశ్య నేతలు నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చౌట శ్రీనివాసరావు, సరికొండ వెంకటేశ్వరరాజు, కొల్లిపర కాశీవిశ్వనాథం, ఆతుకూరి నాగేశ్వరరావు, పోతుగంటి నరసింహారావు, మస్తాన్‌వలి, మారెళ్ళ మల్లేశ్వరరావు, పోట్ల ఆంజనేయులు, బుడే, బండారు నాగరాజు, బత్తుల వెంకటస్వామి, గుజ్జర్లపూడి స్టాలిన్, కట్టా రమేష్, జవ్వాజి రామ్మోహనరావు, కూటమినేతలు, ఆర్యవైశ్యనేతలు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: మాజీ సీఎం రోశయ్య వర్ధంతిని మాచర్లలో నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు, పోలా శ్రీనివాసరావులు రోశయ్య విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ రీజనల్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, టి.వెంకటనాగేశ్వరరావు, సీహెచ్ వెంకటరెడ్డి, కె. అమర్, సత్యనారాయణ పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు



రోశయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా

శివాలయంలో మంత్రి నారాయణ పూజలు



మంత్రి నారాయణను సత్కరిస్తున్న అర్చకులు

అమరావతి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) రెండవ దఫా భూ సమీకరణ జరిగే గ్రామాలలో ఒకటైన ఎండ్రాయిలోని శివాలయాన్ని మంత్రి నారాయణ, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సందర్శించి పూజలు నిర్వహించారు. గ్రామంలో రైతులను కలిసేందుకు వచ్చిన నారాయణ, స్వామివారిని దర్శించుకున్న అనంతరం రైతులతో మాట్లాడి వెళ్తూ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై విచారణ

సత్తెనపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రసవం నిమిత్తం వచ్చిన షేక్ ఆష్మాపట్ల నర్సింగ్ సిబ్బంది, వైద్యురాలు అమర్యాదగా వ్యవహరించారనే సమాచారం మేరకు వైద్యవిధాన పరిషత్ పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రసన్న గురువారం ఏరియా వైద్యశాలలో విచారణ జరిపారు. సూపరింటెండెంట్ లక్ష్మణరావును, ఆర్ఎంవో కృష్ణమూర్తిని, నర్సింగ్ సిబ్బందిని పిలిపించి విచారించారు. విచారణ నివేదికను వైద్య విధాన పరిషత్ రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు. స్థానిక నర్సింగ్ సిబ్బందికి మెమోలు ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

రెండో ఆపరేషన్‌కి రోగి బంధువుల సంతకం తప్పనిసరి

ప్రసవం నిమిత్తం గర్భిణీ రెండోసారి వైద్యశాలకు వచ్చినప్పుడు మరలా సీజేరియన్ చేయాలంటే కుటుంబసభ్యుల సంతకం తప్పనిసరని ఏరియా వైద్యశాల గైనకాలజిస్టు డాక్టర్ అరుణ గురువారం తెలిపారు. బెల్లంకొండకు చెందిన ఆష్మా మంగళవారం రాత్రి 8:30 గంటలకు రెండో డెలవరీ నిమిత్తం ఏరియా వైద్యశాలకు వచ్చారని, 4 గంటల నుంచి ఉమ్మనీరు పోతుందని చెప్పారన్నారు. విధి నిర్వహణలో ఉన్న స్టాఫ్‌నర్సు పరీక్షలు చేసి తనకు సమాచారం అందించారని, వెంటనే తాను రోగి బంధువులతో రిస్క్ పత్రంపై సంతకం తీసుకోవాలని నర్సింగ్ సిబ్బందికి సూచించామన్నారు. వారు సంతకం పెట్టకుండా ప్రైవేట్ వైద్యశాలకు వెళ్ళిపోయారని తెలిపారు. తాను చెప్పిన విషయాన్ని రోగి బంధువులు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి వాట్సాప్‌లో ప్రచారం చేశారన్నారు. ఇలా దుష్ప్రచారం చేయటం తగదన్నారు.

డాక్టర్లు స్టే డ్యూటీ చేయాలి...

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రసవానికి సంబంధించిన కేసులు వచ్చినప్పుడు సంబంధిత డాక్టర్లు స్టే డ్యూటీ చేయాలని ఆస్పత్రి నర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు. స్టేడ్యూటీలో గైనకాలజిస్టులు, పిల్లల డాక్టర్లు ఉంటే నర్సింగ్ సిబ్బందికి సమస్య ఉండదన్నారు. కాల్ డ్యూటీ డాక్టర్లు డ్యూటీ నిర్వహించకపోవటం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దీనిపై వైద్య విధాన పరిషత్ జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగ చంద్రకుమారి

పిడుగురాళ్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఎంపిపి గార్లపాటి అనసూర్య, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ నాగచంద్రకుమారి, పలు గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపిడిఓ నాగచంద్రకుమారి, ఎంపిపి గార్లపాటి అనసూర్యలు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి గ్రామాలను అభివృద్ధి దిశగా చేసుకునేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికి అందుతున్నాయన్నారు. పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారులు ప్రభావతి, పద్మావతి, ఎంఈఓ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రాజారావు

దాచేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ దాచేపల్లి మండల శాఖ అధ్యక్షులుగా పీ రాజారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం యూటీఎఫ్ నాయకులు తెలియజేస్తూ నారాయణపురంలోని యూటీఎఫ్ కార్యాలయం నందు కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో గౌరవ అధ్యక్షులుగా నాగండ్ల ఏసయ్య, ప్రధానకార్యదర్శిగా తగరం ఆనంద్‌కుమార్, సహాధ్యక్షులుగా షేక్ నాగుల్‌మీరా, వీఎం రత్నకుమారి, అదనపు ప్రధానకార్యదర్శి ఎల్ వాసుదేవరావు, కోశాధికారిగా జీవీ శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి యూ సుబ్బలక్ష్మి, మహిళా కార్యదర్శి పీ స్వరూపాదేవి, సీహెచ్ వెంకటరమణ, యామినిదేవి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా టీ అరుణకుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వట్టెపు నగేశ్వరరావు, కేవీ శ్రీనివాసరావు, ఎన్‌వీ రాంబాబు, మస్తాన్‌వలి, మోజేష్, సురేష్ ఉన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

దుర్గి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ దుర్గి మండలం శాఖ నూతన కార్యవర్గంను గురువారం మాచర్లలోని జడ్పీ హైస్కూల్‌లో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా షేక్ నబీషాహెబ్, అధ్యక్షుడిగా మంగళనాయక్, ప్రధాన కార్యదర్శి యర్రం ఏడుకొండలు, మహిళా కన్వీనర్‌గా కటకం అపర్ణ, ఆర్థిక కార్యదర్శిగా అంకిపల్లి బంగారయ్య, సీపీఎస్ కన్వీనర్‌గా కళ్యాణ్ చక్రవరి, జిల్లా కౌన్సిలర్లుగా జీసీహెచ్ అనంతరామయ్య, బూసాని శ్రీనివాసరావు, సైదారావు, ఉపాధ్యక్షులుగా హసీనా, భారతి ఫ్లోరెన్స్, పున్నారావు, సంయుక్త కార్యదర్శులుగా చంద్రరామారావు, కటకం రాంబాబు, కృష్ణానాయక్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి వీరిచే ప్రమాణం చేయించారు.

అనధికార నిర్మాణాలను చట్టబద్ధం చేసుకోండి

దాచేపల్లి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అనుమతించిన ప్లాన్‌కంటే అదనంగా నిర్మించిన భవనాలను క్రమబద్దీకరించు కోవటానికి రాష్ట్ర ప్రభుత్వం ఓ అవకాశాన్ని కల్పించిందని, దీన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో దాచేపల్లి నగర పంచాయతీ ప్రజలను కోరారు. గురువారం కమిషనర్ తెలియజేస్తూ 1985 జనవరి 1నుంచి ఆగస్టు 31, 2025 మధ్య కాలంలో నిర్మించిన భవనాలను చట్టబద్దం చేసుకోవాలని వివరించారు. వివరాలకు నగర పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాల్సిందిగా వివరించారు.

తడి, పొడిచెత్తను వేరుచేసి వర్మి కంపోస్టును తయారు చేయాలి

● డిప్యూటీ ఎంపీడీవో జే యమున

నకరికల్లు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో హరిత రాయబారులు ఇళ్ళ నుంచి తెచ్చే తడి, పొడిచెత్తను వేరుచేసి సంపద తయారీ కేంద్రంలో తడిచెత్తను ఎరువుగాను, పొడిచెత్తను తిరిగి ఉపయోగించే రీసైకిల్ ద్వారా వాటి ఉత్పత్తిని తగ్గించటానికి కృషిచేయాలని డిప్యూటీ ఎంపీడీవో జే యమున సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అసిస్ట్, ఐటీసీలు సంయుక్తంగా పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, సర్పంచ్‌లు, స్వయం సహాయక సంఘాల వీవోఏలు, సీఆర్‌పీలకు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్ట్ జిల్లా శిక్షకులు సీహెచ్ బొల్లయ్య, శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ రమేష్, డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ ప్రసాదు, కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, అనీల్ కుమార్, ఏసోబు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

పెదకూరపాడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. గతంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయా గ్రామాల సమస్యలు సమావేశంలో బహిరంగంగా తెలిపేవారు. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ప్రజాప్రతినిధులు, అధికారులు అంతంత మాత్రంగానే పాల్గొన్నారు.

సింగరుట్ల ఆలయ పునఃనిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు

కారంపూడి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీసింగరుట్ల లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి రూ.2కోట్లు మంజూరయ్యాయని ఈవో సీహెచ్ శివనాగిరెడ్డి తెలిపారు. మండలంలోని పేటసన్నిగండ్లలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి, దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త గుండాల శ్రీనివాసరావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.





ఆకట్టుకున్న ఆంధ్ర ఏకలవ్య

- కరతాళ నీరాజనం అందుకున్న 'ఆపరేషన్ సిందూర్'
- కేఎల్‌యూలో 2వ రోజు ఉద్భవ్ ఉత్సవం
- 22 పతకాలతో ప్రథమ స్థానంలో ఒడిశా
- 20 పతకాలతో ద్వితీయ స్థానంలో తెలంగాణ

తాడేపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఉద్భవ్ - 2025 గిరిజన వేడుకల్లో భాగంగా కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 6వ జాతీయ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సొసైటీ సంప్రదాయ, సంస్కృతి కళా ఉత్సవంలో రెండవ రోజు గురువారం వివిధ రకాల పోటీలు నిర్వహించారు. 49 ఈవెంట్లలో ఇప్పటి వరకు 29 ఈవెంట్లు పూర్తి కాగా 22 పతకాలతో ప్రథమ స్థానంలో ఒడిశా, 20 పతకాలతో రెండవ స్థానంలో తెలంగాణ నిలిచింది. 11 పతకాలు సాధించి 5వ స్థానంలో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ నిలిచింది. 16 పతకాలతో సిక్కిం 3వ స్థానం, 13 పతకాలతో ఉత్తరాఖండ్ 4వ స్థానం దక్కించుకున్నాయి. శాస్త్రీయ సంగీతం, ఆసు కవిత్వ విభాగాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పసిడి పతకం దక్కింది. దేశభక్తి, గ్రూప్ సాంగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు 3వ స్థానం దక్కింది. గురువారం సీనియర్స్, జూనియర్స్ విభాగంలో గిరిజన పాటలు, సంస్కృత శ్లోకాలు, కవితా పఠనం, ఆంగ్ల పద్యాలు, క్విజ్, హిందీ, ఆంగ్లంలో వక్తృత్వం, దైవభక్తి గీతాలు, జానపద గేయాలు, సంగీత వాయిద్యాల కచేరి, నృత్య నాటక, సంగీత, దృశ్య కళల ద్వారా సంప్రదాయ కథనాల వక్త పోటీలు, మిమిక్రీ, క్లాసికల్ సంగీత గాత్ర కచేరి నిర్వహించారు. శుక్రవారం 9 విభాగాలలో పోటీలను నిర్వహించి సాయంత్రానికి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

నేడు ముగింపు

ఉద్భవ్ 2025 కార్యక్రమం శుక్రవారం ముగియనుంది. చివరి రోజున 9 విభాగాలలో పోటీలు జరగనున్నాయి. రీజినల్ ట్రైబల్ డ్యాన్స్, కర్ణాటక సంగీత గానం, జానపద సంగీతం, నాటిక, ఆర్కెస్ట్రా విభాగాలకు పోటీలు జరగనున్నాయి.

అలరించిన ఏకలవ్య, ఆపరేషన్ సిందూర్ నాటికలు

నాటిక ప్రదర్శనలలో ఆంధ్రప్రదేశ్ నుంచి లక్ష్య సాధనలో ఏకాగ్రత, గురుభక్తి ఎంత ప్రాముఖ్యత వహిస్తాయో తెలుపుతూ ఏకలవ్యుడు, ద్రోణాచార్యుడు, కథాంశంతో ఏపీ ఈఎంఆర్ఎస్ విద్యార్థుల ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. పహల్గాం దాడిలో మరణించిన వారికి నివాళిగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్ జీవిత చరిత్రను, పోరాట పటిమను నాటిక రూపంలో తెలంగాణ విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన ఇవ్వడంతో ఆడిటోరియం మొత్తం కరతాళ ధ్వనులతో మారుమోగిపోయింది. మహిళకు చదువు ఎంత ముఖ్యమన్నది జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే జీవితకథను నాటిక రూపంలో మహారాష్ట్ర విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారు. ఇలా..... ప్రతి రాష్ట్రం నుంచి విద్యార్థులు విభిన్న కోణాలలో ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమి, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటూరి, రంపచోడవరం ఐటీడీఏ పీడీ స్మరణ్‌రాజ్, ఇతర గిరిజన సంక్షేమ శాఖ నెస్ట్ ఉన్నతాధికారులు పర్యవేక్షించారు.





పాటలు పాడుతున్న విద్యార్థినులు

సినీనటుడు బ్రహ్మానందంకు బొల్లిముంత పురస్కారం

తెనాలి అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందంకు బొల్లిముంత శివరామకృష్ణ జాతీయ స్థాయి జీవితకాల పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. అంతర్జాతీయ రంగస్థల కళాకారుడు, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణకు రంగస్థల విశిష్ట కళా పురస్కారం ప్రదానం చేస్తారు. గుంటూరు జిల్లా తెనాలిలో శని, ఆదివారాలలో బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవాలు జరుగుతాయని ఫౌండేషన్ కన్వీనర్ చందు సుబ్బారావు గురువారం తెలిపారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిగే ఈ ఉత్సవాలలో కూచిపూడి నాట్య కళాకారులు 500 మందితో ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్, ప్రజా సాహితీ సంపాదకుడు కొత్తపల్లి రఘుబాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ఏఎన్‌యూ విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో ఐజీ త్రివిక్రమ్ వర్మ



ప్రతిజ్ఞ చేస్తున్న ఐజీ త్రివిక్రమ్ వర్మ తదితరులు

ఏఎన్‌యూ డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐజీ త్రివిక్రమ్ వర్మ సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో గురువారం ఆర్ట్స్, సైన్స్, వ్యాయామ, ఫార్మసీ కళాశాలల ప్రథమ సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి ఐజీ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ గంజాయి లాంటి మాదక ద్రవ్యాలు యువత వద్ద లభించినా.. లేక రవాణా చేసినా.. నాన్ బెయిలబుల్ కేసుల కిందకు వస్తుందని చెప్పారు. నార్కోటిక్ కో-ఆర్డినేషన్ సెంటర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం చేస్తుందని, యువత ఒక్కసారి మాదకద్రవ్యాల కేసులో చిక్కుకుంటే భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. సభకు అధ్యక్షత వహించిన వర్సిటీ తాత్కాలిక ఉపకుల పతి ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ ర్యాగింగ్, మాదకద్రవ్యాల రహిత విశ్వవిద్యాలయంగా ఏఎన్‌యూ పేరుగాంచిందన్నారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవడంతో పాటు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని సూచించారు. రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఉద్యోగ అవకాశాలు లభించే సర్టిఫికెట్ కోర్సులను చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు.. విశ్వవిద్యాలయం కృషి చేస్తుందన్నారు. ప్రపంచ దేశాల కంటే భారత్‌లో యువశక్తి అధికంగా ఉందని, ఈ యువ శక్తిని దేశం సద్వినియోగం చేసుకుంటే ప్రపంచ దేశాల కంటే భారత్ ఉన్నతమైనదిగా తయారవుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల నిరోధకం ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో సైన్స్, వ్యాయామ, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య వీరయ్య, ఓఎస్డీ ఆచార్య రవికుమార్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వీవీఐటీ యూనివర్సిటీలో సందడి చేస్తున్న శంభాల చిత్ర బృందం

మంచి కథకోసం ఎదురు చూశా

- సినీ నటుడు ఆది సాయికుమార్
- వీవీఐటీయూలో శంబాల సందడి

పెదకాకాని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నటుడు ఆది సాయి కుమార్, అర్చన అయ్యర్, స్వశిక ప్రధాన పాత్రల్లో.. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన థ్రిల్లర్ శంబాల చిత్ర బృందం వీవీఐటీ యూనివర్సిటీలో గురువారం సందడి చేసింది. ఈ నెల 25న సినిమా విడుదల నేపథ్యంలో ప్రచార కార్యక్రమంలో భాగంగా వర్సిటీ విద్యార్థులతో నటీనటులు ముచ్చటించారు. హీరో ఆది మాట్లాడుతూ ఈ చిత్రం ఆద్యంతం వినూత్నంగా ఉంటుందని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. మంచి కథ కోసం చాలా సంవత్సరాలు ఎదురు చూశానని, ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్టెప్పులేసి.. సెల్ఫీలతో సందడి చేశారు. హీరోయిన్ అర్చన అయ్యర్, దర్శకుడు యుగంధర్, వర్సిటీ రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

పీజీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఏఎన్‌యూ డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, అనుబంధ ప్రభుత్వ కళాశాలల్లో ఏపీ పీజీ సెట్-2025 కౌన్సెలింగ్ అనంతరం కన్వీనర్ కోటా కింద ఎంఏ, ఎమ్మెస్సీ, ఎం.కామ్ తదితర కోర్సుల్లో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు ఉన్నత విద్యాశాఖ అనుమతిచ్చింది. ఈ మేరకు ఏపీ ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ జీవో నంబరు 230ను గురువారం జారీ చేశారు. ఏపీ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి కన్వీనర్ కోటా కింద ఖాళీ సీట్ల భర్తీపై రాసిన లేఖను పరిశీలించిన అనంతరం స్పాట్ ప్రవేశాలకు అనుమతిచ్చామని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

స్పీడ్.. యాక్సిస్ రోడ్డు పనులు

- ఫేజ్- 2లో కి.మీ. మేర సెంటర్ కారిడార్ రోడ్డు పూర్తి



సీడ్‌యాక్సిస్ రోడ్డులో మొదలైన తారురోడ్డు నిర్మాణం

- మంతెన ఆశ్రమం నుంచి సీఎం ఇంటి వరకు పొడిగింపు
- అనుసంధానంగా రెండు అప్రోచ్‌లు
- కుడి, ఎడమ కారిడార్లలో మౌలిక సదుపాయాలు

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రహదారి వ్యవస్థలో అత్యంత ప్రధానమైన సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణ పనుల్లో మరో ముందడుగు పడింది. ఇప్పటి వరకూ దొండపాడు నుంచి వెంకటపాలెంలోని మంతెన ఆశ్రమం వరకు ఉన్న రోడ్డును దాదాపు ఉండవల్లిలోని సీఎం ఇంటి వరకు విస్తరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీడ్ యాక్సిస్ రోడ్డు ఫేజ్-2 పనులు మొదలైన ఆరు నెలల్లో వేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సీడ్ యాక్సిస్ రోడ్డుకు సంబంధించి సెంటర్ కారిడార్‌లోని 3 లేన్ల రోడ్డుకు సంబంధించి కిలోమీటరు మేర తారు రోడ్డు పనులు జరుగుతున్నాయి.

● మూడు దశల్లో రోడ్డు నిర్మాణం

రాజధాని అమరావతిలోని దొండపాడు నుంచి తాడేపల్లిలోని ఎన్‌హెచ్ 16 వరకు సీడ్ యాక్సిస్ రోడ్డును మూడు దశల్లో నిర్మిస్తున్నారు. తొలి దశలో ఫేజ్- 1 కింద దొండపాడు నుంచి వెంకటపాలెంలోని మంతెన సత్యనారాయణ ప్రకృతి ఆశ్రమం వరకు 14.350 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం జరిగింది. మూడు కారిడార్లుగా 9 లేన్లలో 2019కి ముందే ఈ రోడ్డును నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫేజ్-2 కింద మంతెన సత్యనారాయణ ఆశ్రమం నుంచి ఉండవల్లి లోని కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వెనుక భాగం వరకు 4 కి.మీ. మేర రోడ్డును విస్తరించనున్నారు. ఫేజ్-3 కింద అక్కడి నుంచి తాడేపల్లిలోని కనకదుర్గమ్మ వారధి వరకు రోడ్డును విస్తరిస్తారు. అయితే 2019కి ముందే ఫేజ్- 1 పనులు పూర్తయ్యాయి. పెనుమాక, ఉండవల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు అప్పట్లో భూసమీకరణ కింద భూములిచ్చేందుకు నిరాకరించడంతో రోడ్డు నిర్మాణం అక్కడితో ఆగిపోయింది. తాజాగా ఆ పనులు గాడిన పడ్డాయి. భూసమీకరణకు రైతులు ముందుకు రావడంతో పనుల్లో వేగం పెరిగింది. కేవలం ఆరు నెలల వ్యవధిలో మెరకవేసి, వివిధ దశల్లో రోడ్డును నిర్మించి గురువారం తారు వేస్తున్నారు. తొలిరోజు 160మీ. మేర సెంట్రల్ కారిడార్‌లోని 3 లేన్ల రోడ్డుకు తారు వేశారు. శుక్ర, శనివారాల్లో మిగిలిన రోడ్డును పూర్తిచేయనున్నారు. కాగా ఒక చోట 80 మీటర్ల మేర భూమి రాకపోవడంతో అక్కడ బీటీ రోడ్డుతో సరిపుచ్చుతున్నారు. కాగా దీనికి సంబంధించి పూలింగ్ ప్రక్రియ కూడా పూర్తయిందని, త్వరలో ఆ పని కూడా పూర్తవుతుందని సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులు చెబుతున్నారు. ఈ రోడ్డును కలిపేందుకు.. సీఎం ఇంటి వెనుక భాగంలో కరకట్ట నుంచి ఒక అప్రోచ్ రోడ్డు, ఉండవల్లి నుంచి కరకట్ట వచ్చే రోడ్డు నుంచి మరో అప్రోచ్ రోడ్డు నిర్మిస్తున్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

● మౌలిక సదుపాయాలు

సీడ్ యాక్సిస్ రోడ్డులోని కుడి, ఎడమ కారిడార్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు జరుగుతున్నాయి. ఈ రెండు కారిడార్లలో మురుగునీటి డ్రెయిన్, వరద నీటి డ్రెయిన్, మంచినీటి పైపులైను, భూగర్భ విద్యుత్, కమ్యూనికేషన్ లైన్లు, యుటిలిటీ డక్టుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందువల్ల అక్కడ బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఏడీసీ చేపట్టింది.

కూలీల కొరత

- రోజు రోజుకు భారంగా సేద్యం
- కూలీలు 40, 50 ఏళ్లు పైబడిన వారే
- ఉపాధి పథకం అనుసంధానంతో సమస్య పరిష్కారం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీల కొరత పెరుగుతోంది. దీంతో అధిక శాతం రైతులు తమ భూములను కౌలుకు ఇచ్చేస్తున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయించేందుకు.. రైతులు కూలీల ఇళ్లకు ఆటోలు, ట్రాక్టర్లు పంపించడం.. పని ప్రదేశంలో మినరల్ వాటర్, శీతల పానీయాలు అందించడం విశేషం.



నరసరావుపేట మండలం పాలపాడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌ఫోటో)

కాంట్రాక్ట్ పనులు

రోజువారీ కూలీ విధానానికి కాలం చెల్లింది. ఇప్పుడంతా కాంట్రాక్టు పద్ధతి నడుస్తోంది. వ్యవసాయానికి డిమాండ్‌ను బట్టి కూలీ రేట్లు వచ్చేశాయి. విత్తనాలు నాటడం దగ్గర నుంచి కోతల వరకు అన్ని పనులకు కాంట్రాక్టు విధానమే. వ్యవసాయ పనులు త్వరగా చేయించుకోవాలనే ఆత్రుతతో రైతుల మధ్యే పోటీ నెలకొని కూలీల రేట్లు పెంచేస్తున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగిపోయి నష్టాల పాలవుతున్నారు.

ఉపాధికి పట్టణాల బాట

గ్రామాల్లో చదువుకున్న యువత ఉపాధి అవకాశాల కోసం పట్టణాలకు వెళుతున్నారు. కూలి పనులు చేసుకునే వారు సైతం ఉపాధి అవకాశాల కోసం పట్టణాల బాటపడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో 40, 50 ఏళ్లు పైబడిన వారే వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారు.

ఉపాధి పథకానికి అనుసంధానం చేయాలి

ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం వల్ల కూలీల కొరతకు కొంత పరిష్కారం దొరుకుతుందని రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు. నాట్లు, కోతలు, మొక్కజొన్న కండెలు విరిచేటప్పుడు, మిర్చి కోతలకు రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం.

ప్రభుత్వాలు మేల్కోవాలి

కూలీలు దొరక్క నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూలీల కొరతతో సాగు కొనసాగడం కష్టం. పరిష్కారానికి ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.

-అల్లూరి కోటేశ్వరరావు, రైతు, ఇసప్పాలెం.

వంటగదికి ఊరట!

- దిగొచ్చిన కూరగాయల ధరలు

గుంటూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు ప్రస్తుతం దిగొచ్చాయి. కొన్ని రోజులు హడలెత్తించిన ధరలు సాధారణ స్థితికి చేరుకోవటంతో సామన్య ప్రజలకు ఊరట కలిగినట్లయింది. పంట దిగుబడి పెరగడం, మార్కెట్‌కు పెద్ద ఎత్తున కూరగాయల ఉత్పత్తులు రావడంతో ధరలు దిగొచ్చాయి. మొన్నటి వరకు టమోటా కేజీ రూ.80 విక్రయించగా ప్రస్తుతం రూ.40కు చేరుకుంది. సన్నరకమైతే రూ.30కే విక్రయిస్తున్నారు. ఇక క్యారెట్ కేజీ రూ.100 పైనే విక్రయించారు. ప్రస్తుతం రూ.80 చెబుతున్నారు. ఇక దొండ కాయ ఒక దశలో రూ.80కు విక్రయించగా ప్రస్తుతం ధర సగానికి పడిపోయింది. ఇక బెండకాయలు కూడా గతంలో కేజీ రూ.60లకు విక్రయించగా ప్రస్తుతం రూ.40 వరకు అమ్ముతున్నారు. వంకాయ కేజీ ధర రూ.80 నుంచి రూ. 30కి పడిపోయింది. తాజాగా తగ్గిన కూరగాయల ధరలతో వంట ఖర్చు.. సామాన్యులకు కొంత తగ్గి.. ఆర్థిక భారం తప్పనుంది.



కోటప్పకొండ గిరి ప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండకు పౌర్ణమి సందర్భంగా గురువారం గిరి ప్రదక్షిణకు భక్తులు భారీగా తరలివచ్చారు. కోటప్పకొండ గిరి ప్రదక్షిణ రోడ్డు శివనామస్మరణతో మార్మోగింది. గురువారం తెల్లవారుజామున ప్రారంభమైన గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో నరసరావుపేట పట్టణంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. గిరి ప్రదక్షిణ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు అల్పాహారం, తాగునీరు ఏర్పాటు చేశారు. గురువారం గిరి ప్రదక్షిణ భక్తులకు దాతలు కొర్రపాటి వెంకట్రావు, సరస్వతమ్మ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

బీఫ్ మార్కెట్ తరలింపు హెచ్చరిక ఫ్లెక్సీల తొలగింపు

వినుకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రోడ్డుపై బీఫ్ విక్రయాలు చేపట్టరాదంటూ ఇటీవల పోలీస్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా కలిసి హెచ్చరించారు. రోడ్డుపై విక్రయాలు చేపట్టకుండా ఆది, గురువారాల్లో వేకువజామున అధికారులు ఆప్రాంతానికి చేరుకొని విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బీఫ్ విక్రయాలు చేపట్టరాదంటూ ఆ ప్రాంతంలో అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించడంతో చర్చనీయాంశమైంది. సీసీ కెమెరా నిఘాలో ఉన్న కూడా ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. సుమారు రూ.10లక్షల వ్యయంతో తిమ్మాయపాలెం రోడ్డులో బీఫ్‌విక్రయాల కోసం జంతువధశాలను ఏర్పాటు చేశామని, పదేపదే విక్రయదారులకు మొరపెట్టుకున్నప్పటికీ మాంసం విక్రయదారులు ఆ ప్రాంతానికి వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది.

100రోజుల యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలి: ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు 100రోజుల యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలుచేయాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు ఆదేశించారు. స్థానిక జడ్పీ పాఠశాలల్లో ఎంఈవో-2 లలితాకుమారి, హెచ్‌ఎం విజయలక్ష్మిలతో కలసి గురువారం ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం జరగనున్న పీటీఎం సమావేశంలో తల్లిదండ్రులకు వాటిని వివరించి వారి సహాయ, సహకారాలతో పాఠశాలకు హాజరుకాని పిల్లల్ని హాజరయ్యేలా చూడాలన్నారు.

క్లుప్తంగా...

శావల్యాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం మండల నూతన కార్యవర్గ సభ్యుల ఎన్నిక గురువారం నిర్వహించారు. ఎస్టీయూ మండలాధ్యక్షుడిగా నెమలకంటి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా చెంచులక్ష్మి, మహిళ కన్వీనర్‌గా షానూష, ఆర్థిక కార్యదర్శిగా శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లుగా కొండ్రముట్ల వెంకటరత్నం, బిళ్ళా రాజారమేష్, షరీఫ్‌బాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

● వినుకొండ: స్థానిక సిద్ధార్థ నగర్‌లోని రాధా డిగ్రీ కాలేజీలో సెమీ క్రిస్మస్ వేడుకలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ ఏ శివరామకృష్ణ, ఈపూరు మండలం ఎలక్ట్రికల్ ఏఈ గాంధీబాబు, రాధా డిగ్రీ కళాశాల డైరెక్టర్ కేవీ రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ కె.లక్ష్మి సావిత్రి అధ్యాపకులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మండలంలోని మానుకొండవారిపాలెం పరిధిలో కోత ముక్క ఆడుతున్న ఎనిమిది మందిని చిలకలూరిపేట రూరల్ పోలీస్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ వారి సిబ్బంది గురువారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.9,250 నగదు, 5 మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

● చిలకలూరిపేట: మండలంలోని పసుమర్రు మద్ది కామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి షేక్ మహమ్మద్ ముస్తాక్ జిల్లా స్థాయిలో జరిగిన కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలలో ద్వితీయ స్థానాన్ని సాధించినట్టు హైస్కూల్ వె.హనుమంతరావు గురువారం తెలిపారు. ఈ నెల 27న రాష్ట్రస్థాయిలో తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగే కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలలో పాల్గొననున్నాడు.

● చిలకలూరిపేట: పట్టణ పరిధిలోని 35ఏళ్లు నిండిన డ్వాక్రా గ్రూపుల మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం సఖి సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్మన్ రఫానీ గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రతి మహిళకు 16 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నట్టు ఆయన తెలిపారు.

● చిలకలూరిపేట: దత్త జయంతి సందర్భంగా గురువారం పురుషోత్తమ పట్నం లోని దత్తాత్రేయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు 6వేల మందితో తైలాభిషేక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. తొమ్మిది కోట్ల ఒత్తులతో మహా కాలయజ్ఞం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, విజయవాడకు చెందిన చెన్నుపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● నాదెండ్ల: నరసరావుపేట మండలంలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రత్యేక శిబిరం సందర్భంగా కనపర్రు పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి గంగాధరరావు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్లలో దత్త జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సాయిబాబాకు ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమాన్ని కమిటీ అధ్యక్షులు వేములపల్లి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఎస్టీ కమిషన్ సభ్యులు వీవీపీ వెంకటప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని సమస్యలను తెలుసుకున్నారు.

ఉద్యాన కేంద్రంగా వినుకొండే లక్ష్యం

● డిమాండ్ ఆధారిత పంటలతో మెరుగైన ఆదాయం
● ఎమ్మెల్యేగా వచ్చే వేతనం రైతులు, దివ్యాంగులకే...
● రైతు విజ్ఞాన యాత్ర ప్రారంభంలో చీఫ్ విప్ జీవీ


ఉద్యాన విజ్ఞాన యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంను ఉద్యాన పంటల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు తీసుకువెళ్తున్నామని ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గంలోని రైతులు గురువారం ఉద్యాన విజ్ఞాన యాత్రకు తరలివెళ్లారు. ఈ యాత్ర వాహనాలను జీవీ ఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. ఉద్యాన రైతుల విజ్ఞాన యాత్రలో భాగంగా ఏలూరు జిల్లా పెదవేగి, జంగారెడ్డిగూడెంలో రెండు రోజుల పాటు పామాయిల్ తోటలు సందర్శించనున్నారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కలలుగంటున్న స్వర్ణాంధ్ర సాధనకు అదే తొలి మెట్టుగా పేర్కొన్నారు. ఉద్యానపంటల ద్వారా రైతులకు ఎకరాకు రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు ఆదాయం వస్తోందని అవే అవకాశాలు మిలిగిన రైతులు కూడా అందిపుచ్చుకోవాలన్నారు. కూరగాయ పంటల్లోనూ ఎకరాకు రూ. 2-3లక్షల ఆదాయం వస్తోందని విజ్ఞాన యాత్రల ద్వారా ఆయా అంశాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. 40నుంచి 50వేల ఎకరాల్లో ఉద్యాన పంటల్ని ప్రోత్సహించే సంకల్పంతో ఉన్నామన్నారు. పామాయిల్ పంట ద్వారా 30ఏళ్లపాటు స్థిరమైన ఆదాయం వస్తుందని, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అది నిరూపణ అయిందన్నారు. అందుకోసం ఇకపై ఎమ్మెల్యేగా ప్రతినెలా వచ్చే జీతాన్ని రైతు విజ్ఞాన యాత్రలు, దివ్యాంగులు, నియోజకవర్గాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లే అవకాశాలకు ఖర్చుపెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో శివశక్తి ఫౌండేషన్ ద్వారా కూడా ఇలాంటి పంటల్ని ప్రోత్సహిస్తామన్నారు. 90% రాయితీతో డ్రిప్, రాయితీపై డ్రోన్లు, యంత్ర పరికరాల పథకాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీనివాసరావు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఈపూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలూరు రైతు సేవ కేంద్రంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రంను చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు పండించిన ధాన్యంను కొనుగోలు చేయడం జరుగుతుందని ఎవరూ అధైర్య పడవద్దని ఆయన అన్నారు. గ్రామానికి చెందిన మునుగోడు శ్రీనివాసరావు అనే రైతు తాను గత కొన్ని సంవత్సరాలుగా అరటి, జామ, పుచ్చ పంటను సాగుచేస్తున్నానని, ప్రభుత్వం ఇచ్చే రాయితీలను పొందలేకపోతున్నానన్నారు. అందుకు కారణం తహసీల్దార్ తనకు చిన్నకారు రైతు సర్టిఫికెట్ ఇవ్వడం లేదన్నారు. రెవెన్యూ కార్యాలయంలో ఏపని కూడా చేయడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ రవికుమార్, ఏవో రామారావు, సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నర్రా కిషోర్, పెమ్మసాని నాగేశ్వరరావు, బొల్లా వెంకటకోటయ్య, గోవిందనాయక్, గోపు వీరాంజనేయులు, అంగలూరు, ఈపూరు సొసైటీ సీఈవోలు కే కోటేశ్వరరావు, పోక కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిల్వ నీటిని తొలగించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు


రైల్వే అండర్‌గ్రౌండ్ వద్ద నిల్వ వున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జివద్ద దీర్ఘకాలంగా నిలిచి పోయిన నీటిని తొలగించాలని శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులను ఆదేశించారు. గురువారం నిల్వ నీటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అండర్ బ్రిడ్జి వద్ద దీర్ఘకాలంగా నిలిచిపోయిన నీరు, దోమలు, దుర్వాసనతో పాటు వాహనదారులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నదన్నారు. దీనిని పరిశీలించి మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులకు ఫోన్‌చేసి తక్షణమే శుభ్రం చేయాలని ఆదేశాలు జారీచేశారు. ప్రజల ఆరోగ్యం, సౌకర్యం ముఖ్యమని ఈ అండర్ బ్రిడ్జి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రైల్వేతో సమన్వయంగా పనిచేయాలని అధికారులకు సూచించారు.

వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్ ప్రారంభం

నరసరావుపేట మండలం లింగంగుంట్లలో బాలవికాస్ సంస్థ ఏర్పాటుచేసిన అత్యాధునిక వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను గురువారం నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలవికాస్ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో లింగంగుంట్ల గ్రామ పెద్దలు, బాలవికాస్ సంస్థ ప్రతినిధులు, స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మాజీ గవర్నర్ రోశయ్యకు ఘన నివాళి


రోశయ్యకు నివాళులర్పిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, తదితరులు

వినుకొండ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ గవర్నర్, మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా వినుకొండ పట్టణం, నరసరావుపేట రోడ్డులోని కొణిజేటి రోశయ్య విగ్రహానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జీవీ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య రాష్ట్రానికి, దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఆయన నిస్వార్థ సేవలు, ఆర్థిక క్రమశిక్షణ, సుదీర్ఘ రాజకీయ అనుభవం నేటితరానికి ఆదర్శనీయం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు శ్రీనివాసరావు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


రోశయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రోశయ్య కృషి: గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఎంతో కృషి చేశారని వైసీపీ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాజకీయ దురంధరుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని శివుని బొమ్మవద్ద ఉన్న కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహానికి వైసీపీ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య రాష్ట్ర అభివృద్ధికి అందించిన సేవలు ఎంతో దోహదపడ్డాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 17సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కొణిజేటి రోశయ్యకు మాత్రమే దక్కిందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నిడమానూరి సురేంద్ర, అన్నా చంద్రమోహన్, కొత్తూరి కిషోర్‌బాబు, కొత్తమాసు మల్లారావు, దివ్వెల రామకృష్ణ, మిట్టపల్లి శేఖర్, బత్తుల విష్ణువర్ధనరావు, పాదర్తి మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని ప్రేమ జంట ఆత్మహత్య

గుంటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని ఓ ప్రేమ జంట ఎలుకలు ముందు తిని ఆత్మహత్య చేసుకున్నారు. పల్నాడు జిల్లా ఈపూరు మండలం బోడెపుడివారిపాలెంకు చెందిన రెడ్డిబోయిన రాంబాబు (23), చింతలచెరువు గ్రామానికి చెందిన శిరీష (22)మృతి చెందారు. నల్లపాడు పోలీసుల కథనం ప్రకారం పల్నాడు జిల్లా ఈపూరు మండలం బోడెపూడివారిపాలెం గ్రామానికి చెందిన రెడ్డిబోయిన రాంబాబు కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. రాంబాబుకు చింతలచెరువు గ్రామానికి చెందిన శిరీషకు ఏడాది క్రితం పరిచయం ప్రేమగా మారి, పెళ్లి చేసుకోవాలనుకున్నారు. అయితే శిరీషకు వేరేపెళ్లి చేసేందుకు కుటుంబ సభ్యులు యత్నిస్తున్నారు. దీంతో గత నెల 28న ఇద్దరు నల్లపాడు వచ్చారు అక్కడ ఎలుకల ముందు కొనుగోలు చేసి తాగారు. 29న ఇద్దరు వినుకొండకు బస్సులో వెళుతూ తాము ఎలుకలు ముందు తీసుకున్నట్లు రాంబాబు కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు వినుకొండ చేరుకుని ఇద్దరిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గత నెల 30న రాంబాబును జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ శిరీష ఈ నెల 2న మృతి చెందింది.. రాంబాబు గుంటూరులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాంబాబు అన్న శివ కృష్ణ ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు రూ .7 లక్షలు విలువైన స్థలం దానం

నాదెండ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.7లక్షలు విలువైన స్థలాన్ని గ్రామస్థులు దానంగా ఇవ్వాలని నిర్ణయించారు. సుమారు ఎనిమిదిన్నర సెంట్ల స్థలాన్ని గ్రామస్థుల విరాళాలతో కొనుగోలు చేశారు. కాగా ప్రధానోపాధ్యాయుడితో పాటు గ్రామ పెద్దలు జడ్పీ సీఈవో జ్యోతిబసు నుంచి అనుమతి కోసం ఆయనను కలిశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రెడ్డి, పెద్దలు వజ్జె సింగయ్య, ఎన్.రాఘవయ్య, బి.నాగేశ్వరరావులు ఉన్నారు.

రాజకీయాల్లోకి కొత్తగా ఎవ్వరూ రావొద్దు

● కలకలం రేపిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడి సెల్ఫీ వీడియో

రొంపిచర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పులుకూరి జగ్గయ్య సెల్ఫీ వీడియో గురువారం కలకలం రేపింది. కొత్తగా రాజకీయాల్లోకి ఎవ్వరూ రావొద్దని తెలిపారు. మీ కుటుంబం కోసం, పిల్లల కోసం పని చేయండన్నారు. మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు తనను రాజకీయాల్లోకి తీసుకువస్తే ఎమ్మెల్యే అరవిందబాబు తనను ప్రోత్సహించారని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు రాలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తలుచుకుంటే ఈ బిల్లులు వెంటనే చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. మంత్రి నారా లోకేశ్ బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ కార్యకర్తలు నష్టపోతుంటే ఎన్ని కంపెనీలు తెచ్చినా ఏమి లాభమని ప్రశ్నించారు.

వయ్యకల్లు సర్పంచ్ వెంకటేశ్వర్లు మృతి

వయ్యకల్లు (శావల్యాపురం) డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వయ్యకల్లు గ్రామ సర్పంచ్ గోనుగుంట్ల వెంకటేశ్వర్లు (75) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఈయన 2021 ఏప్రిల్ 2 నుంచి సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం వెంకటేశ్వర్లుకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు నరసరావుపేటలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి

వెంచర్లను పరిశీలించిన అధికారులు

వినుకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వెంచర్లపై వచ్చిన పలు ఫిర్యాదులపై అధికారులు పరిశీలించారు. మార్కాపురం రోడ్డులోని ఓ వెంచర్ నిర్మాణ సమయంలో ప్రభుత్వ భూములను, ఎన్ఎస్‌పీ కాలువలు ఆక్రమించి వెంచర్ ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో బుధవారం రెవెన్యూ, ఎన్ఎస్‌పీ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

నిరంతరం విద్యుత్ సరఫరా: ఎస్ఈ విజయకుమార్

ఈపూరు డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పత్తిపాటి విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన కొచ్చర్ల, ఈపూరు విద్యుత్ సబ్‌స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి 40దరఖాస్తులు పరిశీలించి సర్వీసులు ఇచ్చామన్నారు. అదేవిధంగా మరో 12వందల సర్వీసులను డిసెంబరు ఆఖరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈ ఎస్.గాంధీ బాబు ఉన్నారు.

పాఠశాలల బస్సుల్లో నిబంధనలు పాటించాలి: ఎంవీఐ నాగేశ్వరరావు

నరసరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని ప్రైవేటు స్కూలు యాజమాన్యాలు రవాణాశాఖ నిబంధనలు పాటించాలని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల ఆవరణంలో పట్టణంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల 150 బస్సులను గురువారం రవాణాశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంటు ఎంవీఐలు పవన్ కుమార్, వంశీకృష్ణ, మనీషా, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

నూజెండ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కెళ్ళపాడులో సర్వే నెంబరు 5/1లో 17.54 ఎకరాల వాగు పోరంబోకు భూమిని స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులు గురువారం ప్రభుత్వ భూమిగా తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో జ్యోతి, గ్రామ సర్వేయర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో తహసీల్దార్ తనిఖీ

నూజెండ్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనవోలు రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జీ రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పీపీసీ కొనుగోలు కార్యక్రమాలపై స్పష్ట మైన సమాచారాన్ని రైతుకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఆంజనేయులు నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరసన

నరసరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో బాగంగా ముస్లిం మైనారిటీల అభివృద్ధికి చేస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని పల్నాడు జిల్లా ఎంఐఎం అధ్యక్షుడు కరిముల్లా డిమాండ్ చేశారు. దుల్హన్ పథకం, దుకాణ్ మకాన్, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు, ఇస్లాం బ్యాంక్ ఏర్పాటు చేయాలంటూ గురువారం నరసరావుపేట పట్టణ బైపాస్‌రోడ్డులోని వల్లప్ప చెరువులో ఎంఐఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి ఆధ్వర్యంలో జల దీక్షతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు కరిముల్లా, నరసరావుపేట ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, సెక్రెటరీ జిక్రియా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరించిన జీవీ


ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రజా దర్బార్‌లో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. నియోజవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి చీఫ్ విప్ జీవీ వినతులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే జైలు, జరిమానా

● జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించినా, వివాహానికి హాజరైనా రెండేళ్ళు జైలు శిక్ష, జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమాదేవి హెచ్చరించారు. పల్నాడు జిల్లా, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమం నరసరావుపేట జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగం కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి మాట్లాడుతూ వివాహ వయస్సు అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ళుగా ఉండాలన్నారు. బాల్య వివాహాలపై సమాచారం తెలియజేయాలన్నారు. పల్నాడు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నజీర్, మహిళా పోలీస్ దిశ సీఐ సుభాషిణి, డీసీపీ యూనిట్ శౌరిరాజు, సంతోషి కుమారి పాల్గొన్నారు.

నరసరావుపేటలో అగ్నిమాపక శాఖ అధికారి తనిఖీ

నరసరావుపేట లీగల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట అగ్నిమాపక కేంద్రాన్ని పల్నాడు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీధర్ గురువారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు.